




# మనం మెదక్

సంగారెడ్డి సిద్దిపేట

శనివారం | 30 | సెప్టెంబర్ | 2023 | పేజీలు : 7


### 19 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

### 20కి పైగా డిమాండ్ల సాధనకై కొనసాగుతున్న సమ్మె

### ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరిక



# మాకు న్యాయం చేయండి సారూ..!

తొగుట, సెప్టెంబర్, 29, మనం న్యూస్: తమ న్యాయమైన డిమాండ్‌ల సాధన కోసం ఈనెల 11 నుండి అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంఒ చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరుకోగా ప్రభుత్వం నుండి సమ్మె విరమింపజేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అంగన్‌వాడి ఉద్యోగులు సమ్మెను రోజు రోజుకు ఉధృతం చేస్తున్నారు. ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంబంధించి తమకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అంగన్‌వాడి ఉద్యోగుల సమ్మె ప్రభావంతో గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాలు మూతపడడంతో చిన్న



పిల్లలకు అందాల్సిన పౌష్టికాహారం, బాలింతలు,నవజాత శిశువుల సంరక్షణ, 3 - 6 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలకు ప్రీ స్కూల్ విద్య ఆగిపోవడం జరిగింది. గత నెల 18 సంబంధిత మంత్రి సత్యవతి రాథోడ్ అంగన్‌వాడి సంఘాలతో జరిపిన సమావేశంలో కొన్ని డిమాండ్‌లపై హామీ ఇచ్చి అదే నెల 25న రిటైర్మెంట్ బెనిఫిట్‌లలో వ్యత్యాసం చూపారని, దీంతో తమ సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న వాదన వినిపిస్తోంది. సమ్మె మొదటి రోజు గ్రామ పంచాయతీ సెక్రటరీల ద్వారా అంగన్‌వాడి సెంటర్ల తాళాలు పగులగొట్టి తెరిచినా తిరిగి మళ్లీ తెరవలేదని ఆరోపించారు. ఇంతకుముందు విఆర్ఏ గ్రామ పంచాయతీ సెక్రటరీలు, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ మిగతా 2లో..

---

## గ్యాస్ సిలిండర్ పేలి భవనం ధ్వంసం

పేలుడు ధాటికి దెబ్బతిన్న చుట్టుపక్కల ఇళ్ల గోడలు



5 లో



5 లో

## హిందూ సంస్కృతి సాంప్రదాయాలను పెంపొందించే పండుగ గణేష్ పండుగ

టిఎస్‌హెచ్‌డిసి చైర్మన్ చింతా ప్రభాకర్.... అంగరంగ వైభవంగా గణేష్ నమజ్జనోత్సవం

## పంట రుణాల రెన్యువల్ ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



6 లో

# మాకు న్యాయం చేయండి సారూ...!




మొదటి పేజీ తరువాయి..

చేయడమే కాకుండా ఆర్టీసి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసి అందులో పని చేస్తున్న సిబ్బందిని ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించారని, తమ ఉద్యోగాలను సైతం పర్మినెంట్ చేయడం పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.

**-అంగన్‌వాడి ఉద్యోగుల బాధ్యతలు**

అంగన్‌వాడి ఉద్యోగులు ప్రతి రోజు ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు గర్భిణీలు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలకు ఇచ్చే రేషన్‌లో భాగంగా ఉడకబెట్టిన గుడ్లు, బియ్యం,పప్పు, నూనె, కూరగాయలు, మని లాలు జారీచ ఏయడం, ప్రీ స్కూల్ కిట్‌ను ఉపయోగించి టైమ్ టేబుల్ ప్రకారం 3 - 6 సంవత్సరాల మధ్య పిల్లలకు ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ నిర్వ హించడం, పిల్లలకు సంతోషకరమైన అభ్యాసవాతావరణాన్ని అందించడం, ఈసిసిఈ కార్డ్‌ను ఉపయోగించి అభివృద్ధి, అభ్యాస సామర్థ్యాలను అంచనా వేయడం, సూచించిన మెనూ ప్రకారం 3 - 6 ఏళ్ల పిల్లలకు సప్లిమెంటరీ న్యూట్రీషన్ ఫీడింగ్, గర్భిణీ, పాలిచ్చే తల్లులకు వేడిగా వండిన భోజనం నిర్వహించడం, తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థంగా తీవ్రమైన పోషకాహార లోపం ఉన్న పిల్లలకు ప్రతి రెండు గంటలకుఒకసారి సూచించిన ఆహారం అందించడం. గ్రోత్ మానిటరింగ్‌లో భాగంగా 0 - 3 పిల్లల్లో ఎదుగుదల మందగమనాన్ని గుర్తించడం ఉంటుంది. అంగన్‌వాడి హెల్పర్‌లు సైతం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో భాగంగా ప్రతి రోజు ప్రాంగణాన్ని శుభ్రపరచడం, స్వచ్ఛమైన తాగునీటిని ఏర్పాటు చేయడం, పిల్లలకు, గర్భిణీ, పాలిచ్చే స్త్రీలకు ఆహారాన్ని వండి వడ్డించడం, కేంద్రంలో పరిశుభ్రత నిర్వహణ వంటివి చేస్తుంటారు.

**అంగన్‌వాడీలు కోరుతున్న డిమాండ్‌లు**

గత 19 రోజులుగా అంగన్‌వాడి ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగంగా సుమారు 20 డిమాండ్‌లు ప్రభుత్వం ముందు ఉంచారు. అందులో ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, నెలకు 26 వేల వేతనంతోపాటు గ్రాట్యుటీ అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో టీచర్లకు రూ. 10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు చెల్లించానలి పెన్షన్ పెంపు, ఈఎస్ఐ, ఉద్యోగుల ఖాళీలు భర్తీ, హెల్త్ కార్డులు జారీ చేసి వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు, ఐసిడిస్ సెంటర్లకు బడ్జెట్ పెంచి వాటిని బలోపేతం చేయడంతోపాటు వాటి కి పక్కా భవనాలు నిర్మించి మౌలి వసతుల కల్పన చేకూర్చాలన్న పలు డిమాండ్‌లతో సమ్మెను కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సిఐటియు నాయకులు భాస్కర్ తదితరులు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా తీసుకొనే నిర్ణయాలపై ఆధారపడి ఉన్న దృష్ట్యా రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సమ్మెను విరమింపజేయడానికి ఏ విధమైన నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

**-ప్రభుత్వం స్పందించి డిమాండ్‌లు పరిష్కరించాలి**

**-వసంత (సిఐటియు అనుబంధ అంగన్‌వాడి యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు)**



తమ న్యాయమైన డిమాండ్ సాధనకై ఈనెల 11 నుండి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతున్నాము. గ్రామాల్లో అంగన్‌వాడి ఉద్యోగుల సేవలను గుర్తించి మాకు న్యాయం చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకొని మా డిమాండ్ల సాదనకై కృషి చేయాలి. ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తాము.

**-అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది**

**-జి. భాస్కర్ (సిఐటియు జిల్లా కోశాధికారి)**



రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడి ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా మొండిగా వ్యవహరించడం సరికాదు. సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్రలో భాగంగానే సమ్మె ప్రారంభం రోజునే సెంటర్ల తాళాలు పగలగొట్టి టీచర్లను, ఆయాలను బెదిరించే కార్యక్రమాలు చేపట్టడం పూర్తిగా నియంతృత్వం, చట్ట వ్యతిరేక కార్యక్రమాలే. మంత్రి సత్యవతి రాథోడ్ తప్పుడు ప్రకటన చేయడం ఉద్యమాన్ని పక్కదారి పట్టించే కుట్రలో భాగమే తప్ప మరోటి కాదు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం కఠిన వైఖరి వీడి సమస్యలు పరిష్కరించాలి.

**-మా సేవలను గుర్తించి సమస్యలు పరిష్కరించాలి**

**-శోభ (అంగన్‌వాడి టీచర్, బంజేరుపల్లి)**





గ్రామాల్లో చిన్న పిల్లల సంరక్షణ విధులతోపాటు ప్రభుత్వం సూచించిన ప్రతి కార్యక్రమంలో భాగం పంచుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాము. జీతాలు పెంచడం, ఉద్యోగ భద్రత కల్పించడం, పెన్షన్ పథకం అందించడం వంటి అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకొని వెంటనే అమలు చేయాలి. ఉద్యోగుల పట్ల ప్రభుత్వ సానుభూతి ఉండాలి తప్ప కక్షసాధింపు తగదు.

**-చాలీచాలని జీతాలతో భారమవుతున్న కుటుంబ పోషణ**

**-బాల్‌లక్ష్మి (ఆయా, తొగుట - 1)**



అంగన్‌వాడీలకు చెల్లిస్తున్న జీతాలు తక్కువగా ఉండడంతో కుటుంబ పోషణ భారమవుతోంది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల కుటుంబ పోషణ ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. అంగన్‌వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేసి, ప్రభుత్వ పథకాలు అందించడం తోపాటు ఉద్యోగ విరమణ అనంతరం ఆసరా పింఛన్ అందించి ఆదుకోవాలి.

**-ఇంటింటికి రేషన్ అందిస్తున్నాం**

**-చంద్రకళ (ఐసిడిఎస్ సిడిపిఓ)**

అంగన్‌వాడి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి పలు సమస్యలపై ఉద్యోగులు సమ్మె చేస్తున్నందున కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రీ స్కూల్ తరగతులు ఆగిపోయాయని, పిల్లలకు అందాల్సిన పౌష్టికాహారం 15 రోజులకు సరిపడా రేషన్ సరుకులను సెంటర్ సూపర్‌వైజర్‌లు, సిఏలు, డిఏల సహకారంతో అందిస్తున్నామని, సమ్మెపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం జరుగుతుంది.

## అండర్ - 14 వాలీబాల్ జట్టును అభినందించిన పిఆర్‌టియు నాయకులు



తొగుట, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః జిల్లా స్థాయిలో జరిగిన అండర్ - 14 వాలీబాల్ విభాగంలో తొగుట మండలానికి ద్వితీయ బహుమతి రావడానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులకు, జట్టు సభ్యులకు పిఆర్‌టియు తొగుట మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి. రామచంద్రారెడ్డి, కనకారెడ్డిలు అభినందనలు తెలిపారు.విద్యార్థులు, పిఈటిలు మరింత కష్టపడి తొగుట మడల విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయిలో సైతం తొగుట మండలానికి గుర్తింపు తెచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. అభినందించిన వారిలో పిఆర్‌టియు సంఘం సభ్యులు ఉన్నారు.

## నేటి మాదిగ రాజకీయ ఐక్య వేదిక సదస్సును జయప్రదం చేయాలి

### సంఘం కో కన్వీనర్‌లు చార్వాక కుమార్, ధర్మారం బాబు



మిరుదొడ్డి, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః నేడు అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలోని ఎస్‌బిఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే మాదిగ రాజకీయ ఐక్యవేదిక సదస్సును విజయవంతం చేయాలని సంఘం కో కన్వీనర్ చార్వాక కుమార్, ధర్మారం బాబు కోరారు. శుక్రవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మాదిగ సంఘ నాయకుల ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ ఈనెల 30 శనివారం రోజున అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలోని ఎస్‌బిఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిపే సమావేశానికి నియోజకవర్గం లోని మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాదిగ కులస్తులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించి మాదిగలను రాజకీయ బానిసలుగా చూడవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘ నాయకులు కనకయ్య, బాబు, కనకయ్య, మల్లేశం, మల్లయ్య, మిరుదొడ్డి మండల కేంద్ర మాదిగ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ డివిజన్ ఆకాంక్షను విస్మరిస్తే

# ప్రజలే బుద్ధి చెప్తారు

**-అరెస్ట్‌లు చేసినా సడక్‌బంద్ విజయవంతం**

**-రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమం ఉధృతం**

**-ముఖ్య నాయకుల అరెస్ట్, కొమురవెల్లి పిఎస్‌కు తరలింపు**



కొమురవెల్లి, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః రెవెన్యూ డివిజన్ ఆకాంక్షను ప్రభుత్వం విస్మరిస్తే బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్తారని జేఏసి నాయకులు అన్నారు. సడక్ బంద్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జేఏసి ముఖ్య నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినప్పటికీ ప్రజల సహకారంతో సడక్‌బంద్ విజయవంతమైందన్నారు. శుక్రవారం మధ్యాహ్నం సిపియం, బీజేపి, కాంగ్రెస్, టిడిపి, సిపిఐ నాయకులు స్థానిక ప్రజలతో కలిసి దుద్దెడ జనగామ ప్రధాన ర హదారి మర్రిముచ్చాల వద్ద సడక్‌బంద్ కార్యక్రమంలో భాగంగా బైఠాయించారు. దీంతో వేలాదిగా వాహనాలు రోడ్డుపై నిలిచి పోయాయి. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలంటూ నాయకులు నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు జేఏసి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేర్యాల ప్రజల ఆకాంక్షను పట్టించుకోవడంలేదని, రోజుల తరబడి దీక్షలు కొనసాగినా కేసీఆర్ ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ నాయకులు పట్టించుకోకపోతే వచ్చే ఎన్నికల్లో కాలగర్భంలో కలిసిపోతారని హెచ్చరించారు. అనంతరం చేర్యాల సిఐ సత్యనారాయణరెడ్డి, కొమురవెల్లి ఎస: నాగరాజు ధర్నా నిర్వహిస్తున్న నాయకులను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సిపియం నాయకులు జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కిష్టారెడ్డి, మత్స్యపారిశ్రామిక సంఘం జిల్లా డైరెక్టర్ తేలు ఇస్తారి, బాల కిషన్, మల్లేశం, సురేందర్‌రెడ్డి, బీజేపి నాయకులు నియోజకవర్గ కో కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నర్రా మహేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు వంగ కిష్టారెడ్డి, పుల్లం బిక్షపతి, జంగని రవి, మండలంలోని పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### -జేఏసి నాయకుల అరెస్ట్

సడక్‌బంద్ కార్యక్రమంలో పాల్గొనకుండా జేఏసి నాయకులు ఆముదాల మల్లారెడ్డి, పుర్మ ఆగంరెడ్డి, తడక లింగం, మిట్టపల్లి నారాయణలను చేర్యాల పోలీసులు అరెస్ట్ చేసి కొమురవెలి స్టేషన్‌కు తరలించారు. అంతేకాకుండా మండలానికి చెందిన కొయ్యడ శ్రీనివాస్, పబ్బోజు రాములు చారి, లింగంపల్లి కనకరాజు, కుడిక్యాల బాలమోహన్, మేకల కృపాకర్‌లను అరెస్ట్ చేసి కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు.

## వైష్ణవి ఆరోగ్యానికి అండగా మంత్రి హరీష్‌రావు

### ఎల్ఓసి అందజేత



కొండపాక, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన చిలుముల నర్సింలు కూతురు వైష్ణవి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉన్న విషయాన్ని కొండపాక మండల బిఆర్ఎస్ అధ్యక్షులు నూనె కుమార్ మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి హరీష్‌రావు వైద్య ఖర్చుల నిమిత్తం వెంటనే రెండున్నర లక్షల వరకు ఎల్ఓసిని వైష్ణవి తండ్రి నరస్సింలుకు అందించారు. అడగగానే అండగా నిలిచిన మంత్రి హరీష్‌రావుకు బిఆర్ఎస్ అధ్యక్షులు నూనె కుమార్, వైష్ణవి తండ్రి నర్సింలు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆరోగ్య సంరక్షణకే క్యాంప్‌లు



నంగునూరు, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నంగునూరు సామాజిక ఆసుపత్రిలో హెల్త్ మేళా క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌ను జెడ్పిటిసి తడిసిన ఉమా వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి హరీష్‌రావు సహకారంతో ఆరోగ్య సంక్షేమం కోసం క్యాంప్‌లు నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిద్దిపేట మెడికల్ కళావాల నుండి ప్రత్యేక వైద్యులు పాల్గొని 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. అవసరమున్న వారికి మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి కోల సునీత, పిఏసిఎస్ ఛైర్మన్ కోల రమేష్ గౌడ్, నాయకులు కోల మహేందర్ గౌడ్, తుమ్మకోలు మహేందర్‌రెడ్డి, ఉల్లి మల్లయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## నంగునూరులో ఆజాద్ కీ అమృత్ మహోత్సవం




నంగునూరు, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః ఆజాద్ కీ అమృత్ మహోత్సవంలో భాగంగా మేరిమిట్టీ మేరా దేశ్ కార్యక్రమం సందర్భంగా శుక్రవారం నంగునూరు ఉన్నత పాఠశాలలో అమృత కలశంకు ప్రత్యేక పూజలు చేసి మట్టిని సేకరించి అమృత కలశంతోపాటు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను చేతపట్టి దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించిన అనంతరం విద్యార్థులచే దేశ సమైక్యత కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్, ఉపాధ్యాయులు రవిందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



## టిజిబి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యపై అవగాహన సదస్సు

బెజ్జంకి, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః ప్రజలు బ్యాంక్ లావాదేవీలు, ఇన్సూరెన్స్, పంట రుణాల వంటి బ్యాంకు లద్వారా అందిచే సేవలపై అవగాహన కలిగి ఉండాలని బ్రాంచ్ మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బెజ్జంకి శాఖ ఆద్వర్యంలో శుక్రవారం బెజ్జంకి మంలల కేంద్రంలో బ్యాంకు ద్వారా ప్రజలకు అందిస్తున్న రుణ సదుపాయాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్ల గురించి ప్రజలకు వివరించారు. బ్యాంకుల ద్వారా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది రాజు, వినియోగదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## తిమ్మారెడ్డిపల్లిలో ఉచిత మెగా వైద్య శిభిరం



కొండపాక, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ రవిందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిభిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడిసిటీ ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిభిరంలో 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 35 మందిని ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ శిభిరంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



## మాదిగ రాజకీయ చైతన్య వేదిక సభకు తరలిరావాలి

### మాదిగ రాజకీయ చైతన్య వేదిక

### కన్వీనర్ గుర్రాల శ్రీనివాస్

తొగుట, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః నేడు అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో జరగబోయే మాదిగ రాజకీయ చైతన్య వేదిక సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని మాదిగ రాజకీయ చైతన్య వేదిక కన్వీనర్ గుర్రాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఛలో అక్బర్‌పేట సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ తొగుట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దుబ్బాక మాదిగ రాజకీయ చైతన్య వేదిక అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో జరగబోయే ఛలో అక్బర్‌పేట సమావేశాన్ని విజయవంతం చేయాలని మాదిగ యువకులకు, విద్యావంతులకు పిలుపునిస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ, రాజకీయ చైతన్య వేదిక కో కన్వీనర్‌లు డప్పు శివరాజ్ మాదిగ, దావులగళ్ల ఎల్లం మాదిగ, తొగుట మండల కన్వీనర్ బొంబాయి వెంకట్, కో కన్వీనర్ కాసర్ల నర్సింలు, మండల నాయకులు లింగాల కృష్ణ, బాలరాజు, కాసర్ల యాదగిరి, లింగాల మహేష్, కె. రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# సడక్‌బంద్‌కు పిలుపునిచ్చిన జేఏసి నాయకులు

### పలువురిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించిన పోలీసులు

చేర్యాల, సెప్టెంబర్, 29, మనం న్యూస్‌: చేర్యాల రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ శుక్రవారం జేఏసి తలపెట్టిన సడక్‌బంద్‌ను చేర్యాల పోలీసులు ముందస్తు చర్యగా కొంతమంది నాయకులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి చేర్యాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. దీంతో భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చి పాత బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. జేఏసి నాయకులను అరెస్ట్ చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు రామగళ్ల పరమేశ్వర్, పుర్మ ఆగంరెడ్డి, అందె అశోక్, గద్దల మహేందర్‌లు అన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.








## నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



హుస్నాబాద్,సెప్టెంబర్ 29,(మనం న్యూస్): వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని హోటల్ యజమానులకు ఆహారం, స్వచ్ఛత పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆమె కోరారు. మిగిలిపోయిన ఆహార పదార్థాలను మున్సిపల్ వాహనంకు అందించాలన్నారు. పార్సల్ ఇచ్చేటపుడు ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని, ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా స్టీలు ప్లేటులను వినియోగించాలని ఆమె సూచించారు. తడి చెత్తతో ఎరువును తయారు చేయాలన్నారు. టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలని, వంటగది, హోటల్స్‌లో పని చేసే కార్మికులు ఎప్పటికప్పుడు చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, కౌన్సిలర్ కోమటి స్వర్ణలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లమ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రవికుమార్, జవాన్లు సారయ్య, ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది, తదితరులున్నారు.

## పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



రామచంద్రాపురం, సెప్టెంబర్, 29, మనం న్యూస్‌: రామచంద్రాపురం డివిజన్ పరిధిలో స్థానిక కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 25.58 కోట్లతో డివిజన్‌లోని కాలనీలలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లో ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ బాలయ్య, మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య, ఆదర్శ్‌రెడ్డి, సర్కిల్ ప్రెసిడెంట్ పర్మేష్, కుమార్ గౌడ్ , శ్రీనివాస్ గౌడ్, ఐలేష్ యాదవ్, బేకు యాదయ్య, పెద్ద రాజు, మహేందర్‌రెడ్డి, బల్ల నర్సింగ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నతనం నుండే దేశభక్తిని అలవర్చుకోవాలి

### పిఎన్ఆర్ సేవా ట్రస్టు అధినేత పోల్కంపల్లి నరేందర్




కొండపాక, సెప్టెంబర్, 29, మనం న్యూస్‌: విద్యార్థులు చిన్నతనం నుండే దేశభక్తిని, క్రమశిక్షణను, నైతిక విలువలను అలవర్చుకోవాలని పిఎన్ఆర్ సేవా ట్రస్టు అధినేత పోల్కంపల్లి నరేందర్ అన్నారు. మేరి మిటీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కుకునూరుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తయ్య ఆధ్వర్యంలో అమృత కళశయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయులంతా మన సహోదరులనే భావనతో ప్రతి ఒక్కరు మెలగాలన్నారు. ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిందని, ఆ మహానుభావుల ఆశయాలను ఆచరణలో పెడుతూ దేశ సేవకై అంకితం కావాలన్నారు. అనంతరం కుకునూరుపల్లిలో స్వచ్ఛమైన మట్టిని కలశం పాత్రలోకి తీసుకొని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో మేరీమిట్టీ మేరా దేశ్ కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందారి కనకవ్వ అయిలయ్య, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ దేవి భూపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### కనీస వేతనం ప్రకటించాలి

### వైఎస్సార్‌టీపి నాయకుడు మల్లికార్జున్ రెడ్డి



హుస్నాబాద్,సెప్టెంబర్ 29,(మనం న్యూస్): ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కన్వీనర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆశా వర్కర్లు చేస్తున్న నిరసన సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. నిరసన కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ -కరీంనగర్ రహదారి పై మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ ఆశా వర్కర్‌లకు పారితోషికాలు కాకుండా ఫిక్స్‌డ్ శాలరీలు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేసారు. ఆశా వర్కర్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం కొనసాగుతున్న లెప్రసీ సర్వేకి అదనంగా డబ్బులు చెల్లించాలన్నారు. కంటి వెలుగు పనికి కూడా అదనంగా ఇవ్వాలన్నారు. కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు. అధికారుల వేధింపులు ఆపాలని, పింఛన్ సౌకర్యంతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. ఏపీలో ఆశా వర్కర్లకు రూ.10 వేలు ఫిక్స్‌డ్ శాలరీ ఇస్తున్నా, ఇక్కడ మాత్రం పూర్తి స్థాయిలో చెల్లించడం లేదన్నారు. ఆశాలను కార్మికులుగా గుర్తించి ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేసి, పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేసారు. లేని యెడల వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ.నాయకుడు రాజు నాయక్, గిరిజన మోర్చ నాయకుడు అనిల్ నాయక్, ఆశా వర్కర్స్ రజిత, జయ, జాల వాణి, రేణుక, భారతి, సరోజ, లలితా, తదితరులున్నారు.

# సిఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ స్వాధీనం

### సిద్దిపేట త్రీ టౌన్ సిఐ భానుప్రకాష్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్, 29, మనం న్యూస్‌: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సిఈఐఆర్ టెక్నాలజీతో స్వాధీనం చేసుకొని బాధితునికి అప్పగించినట్లు సిద్దిపేట త్రీ టౌన్ సిఐ భాను ప్రకాష్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట మైత్రివనం ఎదురుగా పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న సయ్యద్ జుబేర్ అనే వ్యక్తి ప్రతి రోజు పండ్లు అమ్మే సమయంలో భాగంగా 25వ తేదీన ఫోన్ పండ్ల షాప్ వద్ద దొంగిలించబడింది. బాధితుని ఫిర్యాదు మేరకు ఇటీవల నూతనంగా చేపట్టిన సిఈఐఆర్ విధానం ద్వారా ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా ఫోన్‌ను కనిపెట్టి ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి అందించడం జరిగిందన్నారు. ఎవరైనా తమ ఫోన్‌ను పోగొట్టుకున్నట్లయితే త్వరగా స్థానిక




పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లయితే కనిపెట్టి ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు.

# గ్యాస్ సిలిండర్ పేలి భవనం ధ్వంసం

దుబ్బాక టౌన్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి భవనం ధ్వంసమైన సంఘటన దుబ్బాక పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన బండి శ్రీనివాస్ గౌడ్ కరుణలు నివాసముంటున్న భవనం గ్యాస్ సిలిండర్ పేలుడు ధాటికి పూర్తిగా ధ్వంసమైంది. స్థానికుల కథనం ప్రకారం ఇంట్లో సుమారు 8:15 గంటల ప్రాంతంలో పాలు వేడి చేస్తున్న సమయంలో సిలిండర్‌లో నుండి గ్యాస్ లీక్ అవడంతో వెంటనే అప్రమత్తమైన శ్రీనివాస్ కుటుంబీకులు ఇంట్లో నుండి బయటకు వచ్చారు. వారు బయటకు వచ్చిన కేవలం 5 నిమిషాల్లోనే సిలిండర్ భారీ శబ్ధంతో పేలడంతో భవనం పై కప్పుతోపాటు ఇతర గదుల గోడలు పూర్తిగా కూలిపోయాయి. అదేవిధంగా పేలుడు ధాటికి పక్కనే ఉన్న అంకం రామరాజుకు చెందిన భవనం మెట్లు, బాత్ రూమ్‌గోడలు కూలిపోగా, భవనం వెలివేషన్ పై భాగంలో పగుళ్లు ఏర్పడగా, భవనానికి కుడి వైపున ఉన్నటువంటి కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డి భవనం కాంపౌండ్‌వాల్‌తోపాటు మొదటి ఫ్లోర్‌లోని





కిటికీ అద్దాలు ధ్వంసం కాగా, దాని పక్కనే ఉన్న కిష్టమ్మగారి నర్సింహారెడ్డి భవనం కాంపౌండ్ వాల్ పూర్తిగా పూర్తిగా దెబ్బతిన్నది. గ్యాస్ సిలిండర్ ధాటికి ఇంతటి విధ్వంసం జరిగినప్పటికీ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం పట్ల అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలానికి వెంటనే చేరుకున్న ఫైర్ సిబ్బంది సిలిండర్‌ను పరిశీలించి అందులోని గ్యాస్‌ను అదుపులోకి తీసుకువచ్చి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు.

### బాధిత కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ కేటాయిస్తాం
### మున్సిపల్ ఛైర్‌పర్సన్ గన్నె వనితభూంరెడ్డి

గ్యాస్ సిలిండర్ ధాటికి పూర్తిగా భవనం ధ్వంసం కావడంతో నిలువ నీడ లేకుండాపోయిన బండి శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయిస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం చాలా బాధాకరమని, బాధిత కుటుంబానికి తాము అండగా నిలుస్తామన్నారు.

## చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



చేర్యాల, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రభుత్వం ప్రకటించాలని బీజేపి జనగామ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో ముఖ్య కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. జేఏసి ఆధ్వర్యంలో అందరినీ కలుపుకొని అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే మన హక్కుల కోసం పోరాడుతుంటే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ప్రజా హక్కులకు భంగం కలిగిస్తున్నారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇక్కడి ప్రాంత ప్రజలు రెండుసార్లు ఎమ్మెల్యేగా ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని గెలిపిస్తే అభివృద్ధి చేయకుండా కబ్జాలు చేస్తున్నాడని ఆరోపించారు. ఆయనకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి జిల్లా నాయకులు అంకుగారి శశిధర్‌రెడ్డి, సౌడ రమేష్, రామ్‌కోటి, బర్మా శ్రీనివాస్, దండ్యాల లక్ష్మారెడ్డి, కాటం సురేందర్, కాశెట్టి పాండు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుడికి ట్రై మోటార్ సైకిల్ అందించిన జెడ్పీటిసి జ్యోతి శ్రీనివాస్‌గౌడ్



దౌల్తాబాద్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సబ్బండ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటిసి రణం జ్యోతి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ఉద్యమ నాయకుడు వికలాంగుడు శివంది నర్సింలుకు మెదక్ ఎంపి ప్రభాకర్‌రెడ్డి సొంత నిధులతో ట్రై మోటార్ సైకిల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటిసి మాట్లాడుతూ వికలాంగులుగా వారు పుట్టడం నేరం కాదని, వారికి దేవుడు ఆ విధంగా జన్మనిచ్చాడని, మానవత్తవంతో వారిని చూడాలని, చిన్నచూపు చూసి వారిని కించపరచవద్దన్నారు. వికలాంగులు ధైర్యంగా ఉండి ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి తప్ప అధైర్యపడవద్దని సూచించారు. సీఎం కేసీఆర్ వికలాంగుల కోసం రూ.3016ల పింఛన్‌ను రూ.4016లకు పెంచి వికలాంగులకు అండగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రణం శ్రీనివాస్ గౌడ్, తిరుమలాపూర్ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు బండారు దేవేందర్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## యోగా సాధనతో ఏకాగ్రత పెంపు

### యోగా శిక్షకరాలు సంధ్య

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః ప్రతిరోజు యోగా సాధన చేయడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని యోగ శిక్షకురాలు తోట సంధ్య అన్నారు. వ్యాసమహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో సిద్దిపేట అర్బన్ మండలం నాంచార్‌పల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యోగా తరగుతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులయు యోగాభ్యాసాలు చేపించారు. యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఏకాగ్రతతో విద్యపై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు రవి, మల్లికార్జున్‌రెడ్డి, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్ మిషన్



దౌల్తాబాద్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా హీ సేవ – 2023 కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ అప్పవారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. మండల పరిధిలోని గాజుపల్లి గ్రామంలో శుక్రవారం స్వచ్ఛ భారత్ సందర్భంగా ఇండ్ల వద్ద ఉన్న నీటి నల్వాలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హంసకేతన్, వార్డు సభ్యులు రమణ, అంగన్‌వాడి టీచర్ సరోన, ఏఎన్ఎం విజయతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సంస్కృతి సాంప్రదాయాలను పెంపొందించే పండగు గణేష్ పండుగ



సంగారెడ్డి, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః హిందూ సంస్కృతి సాంప్రదాయాలను పెంపొందించే పండుగ గణేష్ పండుగ అని, గణేషున్ని భక్తితో పూజించిన విఘ్నాలు తొలగుతాయని టిఎస్‌హె చ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభా కర్ అన్నారు. గురువారం సంగారెడ్డి సదాశివపేట గణేష్ నిమజ్జనోత్సవంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గణనాథులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేషుడు భక్తుల కోర్కెలు తీర్చే దేవుడని, నేటితరం యువకులు పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉంటూ అనాదిగా వస్తున్న ఆచారాలను గౌరవించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా చక్కటి సాంప్రదాయ పద్ధతిలో గణేష్ ఉత్సవాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఉదయం నుండే పట్టణ మున్సిపాలిటీఓ గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించారు. శాంతి సామరస్యపూర్వకంగా శోభాయాత్ర నిర్వహించాలని పోలీస్ అధికారులతో సమీక్షించారు. మండపాల నిర్వాహకులు సంయమనం పాటించాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా పిల్లలు, పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ట్రాక్టర్లపై కనువిందు చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలతో ముందుకు సాగనడంపడంలో ఉత్సవ కమిటీ పాత్ర ఎంతైనా ఉందన్నారు. రంగురంగుల బాణాసం చాలు, డప్పు చప్పుళ్లు, కోలాటాల, డాన్స్‌ల నడుమ ఘనంగా సాగింది గణేష్ నిమజ్జనం. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ విజయలక్ష్మి, సదాశివపేట మున్సిపల్ ఛైర్మన్ పిల్లోడి జయమ్మ, వైస్ ఛైర్మన్ చింతా గోపాల్, బీజేపి రాష్ట్ర నాయకులు ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజు, డిఎస్పీ, సిఐలు తదితరులు పాల్గొన్నారు.



# పంట రుణాల రెన్యువల్ ప్రక్రియ వేగవంతం చేయాలి



సిద్ధిపేట, సెప్టెంబర్, 29, మనం న్యూస్ ప్రతినిధిః రైతుల పంట రుణాల మాఫీ ప్రక్రియ, కొత్తరుణాలు, పాత పంట రుణాల రెన్యువల్ ప్రక్రియలను వేగవంతం చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ అధికారులకు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో జిల్లాలోని బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులతో రైతు రుణాల మాఫీ ప్రక్రియ, కొత్త రుణాల గురించి అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. వివిధ బ్యాంకుల్లో రైతు రుణమాఫీలు ఎపిజివిబి బ్యాంకులో 6 వేల మంది రైతులకు గాను రూ. 40 కోట్లు, ఎస్‌బిలో 4 వేల మందికి గాను 25 కోట్లు, యుబిఐ బ్యాంక్‌లో 2500 రైతులకు గాను 17 కోట్లు, ఇతర బ్యాంకుల్లోన ఉమారు 3500 అకౌంట్లకు 35 కోట్లు పెండింగ్ రైతు రుణమాఫీ నగదును వేగంగా రైతులకు అందించాలన్నారు. జిల్లాలో దాదాపు 21 వేల మంది రైతులు పంట రుణాల రెన్యువల్ చేయించుకోవాల్సి ఉందని ఆ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. డిబిటి ఫెయిల్యూర్ 216 పెండింగ్‌లో ఉన్న అకౌంట్లకు రైతు రుణమాఫీ పోర్టల్‌లో ఎస్‌బిఐ, ఏపిజివిబి బ్యాంకుల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశిస్తూ మరణించిన రైతుల సమాచారం సేకరించి త్వరగా అందించాలన్నారు. కొత్త రుణాలు అందుకునేందుకు అర్హత కలిగిన రైతుల వద్దకు వ్యవసాయ అధికారులు వెళ్లి రైతులకు రుణాల గురించి తెలపాలని, ప్రజాప్రతినిధులతో రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించి పంట లోన్‌లు తీసుకునేలా చూడాలన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రెండవ విడత వీధి వ్యాపారుల రుణాలను మున్సిపల్ పరిధిలో 1384 మందికి వారం రోజుల్లో మెప్మా అధికారుల సహాయంతో బ్యాంక్ మేనేజర్‌లు అందించాలని ఆదేశించారు. సెర్ఫ్‌లో, మెప్మా పరిధిలో బ్యాంకు లింకేజీలు వేగంగా పూర్తిచ ఏయాలన్నారు. ట్రైకర్‌లోన్ పెండింగ్‌లో ఉన్న 10 రుణాలు, 118 ఎస్సీ కార్పోరేషన్‌రుణాలను క్యాంప్ ఏర్పాటు చేసి వారం లోపు పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ సత్యజిత్, డిఏఓ శివప్రసాద్, డిఆర్‌డిఏ పిడి జయదేవ్ ఆర్యా, ఎస్‌బిఐ ఆర్‌ఎం అరుణ జ్యోతితోపాటు తదితరులు పాల్గొన్నారు.



# ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నుండి ఎస్‌ఐగా ప్రమోషన్

## అభినందించిన సిపి శ్వేత



సిద్దిపేట రూరల్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః సిద్దిపేట ఆర్ హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తునన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ గౌడ్ ఏఆర్‌ఎస్‌ఐగా ప్రమోషన్ పొందారు. ఈ మేరకు సిపి శ్వేత శుక్రవారం ఏఆర్‌ఎస్‌ఐ చిహ్నమైన ఒక స్టార్‌ను అలంకరించి బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా సిపి శ్వేత మాట్లాడుతూ పదోన్నతులు జీవన శైలిని మార్చే విధంగా ఉత్సాహాన్ని కలిగిస్తాయని, పెరిగిన బాధ్యతలకు అనుగుణంగా సక్రమంగా విధులు నిర్వహించినట్లయితే మరిన్ని ఉన్నత పదవులు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఎస్‌ఐగా చక్కగా విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియాజేరు.

# చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



దుబ్బాక టౌన్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః దుబ్బాక మండలం బల్వంతాపూర్‌కు చెందిన కనకయ్య మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ కాకి చెరువులోకి చేపల వేటకు వెళ్లి మృతి చెందినట్లు ఎస్‌ఐ గంగ రాజు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి సమయంలో చెల్లాపూర్ కాకి చెరువులోకి చేపల వేటకు వెళ్లి కనకయ్య మృతి చెందాడు. ఎంతకి ఇంటికి రాకపోయేసరికి అనుమానంతో చెరువు గట్టుపై వెతకగా అతని దుస్తులు చెల్లాపూర్ కాకి చెరువుగట్టుపై గుర్తించి గాలింపు చర్యలు చేపట్టగా శవమై బయటకు వచ్చాడన్నారు. ఈ మేరకు దుబ్బాక ప్రభుత్వాసుపత్రిలో పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో అభివృద్ధి

## జెడ్పి ఛైర్‌పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ

సిద్దిపేట, సెప్టెంబర్, 29, మనం న్యూస్ ప్రతినిధిః రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు ప్రత్యేక కృషితో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సిద్దిపేట జిల్లాలో ఎంతగానో అభివృద్ధి జరుగుతుందని జెడ్పి ఛైర్మన్ రోజారాధాకృష్ణ శర్మ అన్నారు. శుక్రవారం జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘ సమావేశంలో భాగంగా 1 నుండి 7 వరకు అంశాలపై జెడ్పి చైర్మన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం,గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం, విద్య వైద్యం, పనులు, ప్రణాళిక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం జిల్లాలో ఎరువుల కొరత రాకుండా రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రైతురుణమాఫీ జరిగిన సమాచారాన్ని రైతులకు తెలియజేయాలని, ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను త్వరితగతిన చేరుకుకోవాలని సూచించారు. జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 24 వేల మంది మత్స్యకారులుండగా 19 వేల మంది డాటా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయడం జరిగిందని, ఇందులో 12 వేల మందికి కార్డులు అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా గ్రామాల పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల సమ్మె నడుస్తున్న నేపథ్యంలో గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. అనంతరం రంగనాయక సాగర్ పర్యాటక ప్రాంతంగా జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రమంగా చంద్లాపూర్ ఎంపిక పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



# సీఎం సహాయనిధి నిరుపేదకు వరం

## గజ్వేల్ ఏఎంసి వైస్ ఛైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి



జగదేవ్‌పూర్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని గజ్వేల్ ఏఎంసి వైస్ ఛైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్ మండల పరిధిలోని దౌలాపూర్‌కు చెందిన కాదుర్ల మానస అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా అధిక మొత్తంలో డబ్బులు ఖర్చయ్యాయి. గజ్వేల్ ఏఎంసి వైస్ ఛైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి సహాయంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా లబిధదారులకు రూ. 20 వేల చెక్కు మంజూరుకాగా శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఎంపి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి హరీష్‌రావు, ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్‌ఐఎమ్ దిష్టిబొమ్మ దగ్ధం

హుస్నాబాద్,సెప్టెంబర్ 29,(మనం న్యూస్)ః భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కరీంనగర్ కార్యాలయం, నివాసం వద్దకు ఎమ్‌ఐఎమ్ పార్టీకి సంబంధించిన నాయకులు అలజడి సృష్టించేందుకు చేసిన ప్రయత్నానికి నిరసనగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ఎమ్‌ఐఎమ్ పార్టీ దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపీ బండి సంజయ్ కుమార్ హిందూ సమాజానికి ఒక ఐకాన్ అని ఆయన కొనియాడారు. దాడికి యత్నిస్తుంటే పోలీసులు ఏమి చేస్తున్నారంటూ ఆయన ప్రశ్నించారు. బండి సంజయ్ కార్యాలయం, ఇంటి పై దాడికి యత్నించడమంటే హిందూ సమాజం పై దాడికి ప్రయత్నించినట్లేనని ఆయన తెలిపారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి తోట సమ్మయ్య, బీజేవైయమ్ పట్టణ అధ్యక్షుడు బొప్పిశెట్టి



భీమేశ్వర్, మండల ప్రధాన కార్యదర్శి బొల్లి శ్రీనివాస్, నాయకులు భూక్య సంపత్, అక్కు శ్రీనివాస్, రాజేందర్, దుబాయ్ శ్రీనివాస్, తదితరులున్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

### ఎంఆర్ఓకు ఆశా వర్కర్ల వినతి



సంగారెడ్డి, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః ఆశా వర్కర్లు గత కొన్ని రోజులుగా సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా వారి సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్లు కోరారు.

## సోనియమ్మ మాటిచ్చిందంటే నెరవేర్చి తీరుతుంది

### కాంగ్రెస్ యూత్ గ్రామ పార్టీ అధ్యక్షులు జింకల మధు



జిన్నారం, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః జిన్నారం మండలం లోని ఊట్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షులు జింకల మధు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా అధికారంలోకి వస్తుందన్నారు. సోనియమ్మ ఇచ్చినమాట ప్రకారం నెరవేర్చే పథకాల కోసం ప్రజలకుతెలియజేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డు మహిళలకు మహాలక్ష్మి పథకం నెలనెలా రూ.2500లు, 500లకే సిలిండర్, ఫ్రీ ఆర్టీసి ప్రయాణం, రైతు భరోసా ప్రతియేటా రైతుకు కౌలు రైతుకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలతోపాటు పలు పథకాలు ఖచ్చితంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నెలవారి పింఛన్ రూ.4 వేలు, రూ. 10 లక్షల రాజీవ్ ఆరోగ్య బీమా ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ వంటి హామీలు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యేగా గెలవబోతున్నాడని యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు జింకల మధు తెలిపారు.

## పాఠశాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ



గజ్వేల్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణంలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హై స్కూల్ పాఠశాలలో బస్సులు నడిపిస్తున్న డ్రైవర్లు, క్లీనర్లకు ట్రాఫిక్ సిఐ తిరుపతి ఆదేశాల మేరకు శుక్రవారం పోలీస్ సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ యూనిఫామ్ ధరించి బస్సుకు సంబంధించిన ప్రతి డాక్యుమెంట్లను , లైసెన్సును కలిగి ఉండాలన్నారు. వాహనాలను నెమ్మదిగా నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాయప్ప పాల్గొన్నారు.

# కన్నుల పండువగా గణేష్ నిమజ్జనం

### సాయిభగవాన్ కాలనీలో రూ. 90 వేలు పలికిన గణేష్ లడ్డు

అమీన్‌పూర్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ ప్రతినిధిః అమీన్‌పూర్ మున్సిపాలిటీ బీరంగూడ పరిధిలోని సాయిభగవాన్ కాలనీలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రులు 11 రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా ఎంతో వైభవంగా నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా గణపతి లడ్డు వేలంలో కాలనీకి చెందిన టీచర్ రూ. 90 వేలకు గణపతి పెద్ద లడ్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రులను కాలనీ ప్రజల సహకారంతో ఎంతో వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. 11వ రోజు నిమజ్జనం సందర్భంగా లడ్డు వేలంపాటలో కాలనీలో అత్యధికంగా రూ. 90 వేలు పలకడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రావు, ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మురళీకృష్ణ, ట్రెజరర్‌నాగభద్రశర్మ, రాజు, దీపక్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ లడ్డూను దక్కించుకున్న ఉప సర్పంచ్



జగదేవ్‌పూర్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః వినాయకుడి దేవాలయంలో వినాయకుడి లడ్డూను వేలంపాటలో రూ. 20 వేల 101 రూపాయలకు జగదేవ్‌పూర్ మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ బింగి మల్లేశం లడ్డును దక్కించుకున్నారు. మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి వినాయకుడి లడ్డు వేలంపాట నిర్వహించగా మండల కేంద్రంలో పలువురు వేలంపాటలో పాల్గొన్నారు. అందులో ఉప సర్పంచ్ బింగి మల్లేశం వినాయకుడి లడ్డును రూ. 20 వేల 101 రూపాయలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుడి లడ్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు. దేవుని అనుగ్రహంతో లడ్డు దక్కిందన్నారు. ప్రత్యేక పూజలు చేసిన లడ్డు లభించడం గొప్ప పుణ్యంగా భావిస్తున్నానన్నారు.

## ప్రైవేటు పాఠశాల సిబ్బందికి వైద్య పరీక్షలు



గజ్వేల్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః సిద్దిపేట జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ట్రస్మా కోరిక మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు సహకారంతో జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బం దికి ఉచిత ఆరోగ్య పరీక్ష లు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రైవేటు ఉపాధ్యాయులకు, బోధనేతర సిబ్బందికి అక్టోబర్ 1 ఆదివారం రోజున సాయి జిడిఆర్ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటలకు పాఠశాలకు వచ్చి టోకెన్ తీసుకొని ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ట్రస్మా అధ్యక్షులు సోమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మంత్రి హరీష్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి అండగా బిఆర్ఎస్ ప్రభుత్వం



గజ్వేల్, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః సింగాటం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన సంగి స్వామి యాదవ్ (30) అనారోగ్యంతో అకస్మాత్తుగా హైదరాబాద్‌లో మరణించాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నా రు. విషయాన్ని మండల పార్టీ అధ్యక్షులు బెండె మధు ఎమ్మెల్సీ యాదరెడ్డి, ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జెడ్పిటిసి పంగ మల్లేశంలకు తెలుపగా బెండె మధు ఆధ్వర్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగావారు ప్రభుత్వపరంగా వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తాటికొండ మధు సూదన్‌రెడ్డి, చేబర్తి సురేష్‌చారి, గ్రామ పార్టీ అధ్యక్షులు తోకల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నందిగామ బంటురాములు దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం

పటాన్‌చెరు, సెప్టెంబర్, 29, మనం న్యూస్ః పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో ప్రతిష్టించిన వినాయకుడి మండపం వద్దశుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నందిగామ 11వ వార్డు మెంబర్ బంటు రాములు ముదిరాజ్ దంపతులు, బంటు బాలయ్య ముదిరాజ్ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పటాన్‌చెరు జెడ్పిటిసి సుప్రజా వెంకట్‌రెడ్డి, సర్పంచ్ ఉమాపతి గోపాల్, ఉప సర్పంచ్ పల్లె శ్రీశైలం కురుమ, ఎంపిటిసి నాగజ్యోతి లక్ష్మణ్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రామపంచాయతీలో గత 30 ఏళ్లుగా వినాయకుడిని ప్రతిష్టించడం జరుగుతుందని, ఈ వినాయకుడికి ఒక ప్రతిష్ట ఉందని, అన్ని వినాయకులను తీసిన తర్వాత ఈ వినాయకుడిని తీయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అన్నదాన కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది పాల్గొన్నారన్నారు. అనంతరం ఆర్కెస్ట్రా పాటలతో గణనాథుని పాటలతో గ్రామ ప్రజలను అలరించేలా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలంతా విఘ్నేశ్వరుని వద్ద బతుకమ్మ ఆటపాటలతో వినాయకుడిని ఊరేగింపు జరుపుకున్నారు. బంటు రాములు ఆధ్వర్యంలో నిర్వహించడం భక్తులకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం నరసింలు, కావేలి లక్ష్మయ్య గౌడ్, కొండ వీరన్న, తలారి మోహన్, పట్లోళ్ల రంగన్న, ఉపేందర్‌రెడ్డి, మ్యాదరి శ్రీను, మ్యాదరి రాములు, లక్ష్మణ్, రవిందర్ గౌడ్, వార్డు మెంబర్లు వేణు గౌడ్, దేవేందర్‌రెడ్డి, కొండ కృష్ణ, శివ, మ్యాదరి నర్సింలుతోపాటు తదితరులు పాల్గొన్నారు.



